ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 23 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32 (గురువారం)
కనిష్ఠం : 27

# మీ త్యాగాలకు తగిన గుర్తింపు





అమలాపురం కాపు కల్యాణ మండపంలో గురువారం జరిగిన టీడీపీ మహానాడు సభలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, హాజరైన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు

పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు చారిత్రాత్మకం
- దేశంలోనే అత్యధిక స్థానాలతో కూటమి అభ్యర్థుల విజయం
- ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి ధైర్యసాహసాలతో పనిచేసిన కేడర్
- గత సీఎం హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక వ్యవస్థ పతనం
- కోనసీమ జిల్లా మహానాడులో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు
- భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): గత నాలుగు దశాబ్దాల కాలం నుంచి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందని, ఎవరూ అధైర్యపడకుండా మొక్కవోని దీక్షతో పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కాపు కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా మహానాడులో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై సుదీర్ఘంగా ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో సహా పార్టీ శ్రేణులపై చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల బనాయింపు వంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొని టీడీపీ కోసం ఎదురొడ్డి పోరాడిన పార్టీ శ్రేణుల త్యాగాలు ఎప్పటికీ వృథా పోవని పేర్కొన్నారు. చంద్రబాబుని జైలులో పెట్టి రాష్ట్రంలో మరో పార్టీ లేకుండా చేయాలనే జగన్‌పై ప్రజలు ఓటుతో చేసిన తిరుగుబాటు ఫలితంగా గడిచిన శాసనసభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీ స్థానాలతో ఎన్డీఏ కూటమి విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పయనిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో రూ.10 లక్షల కోట్లను అప్పులుచేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, పేరు ప్రతిష్ఠలను దిగజార్చింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 92 పథకాల అమలుకు సంబంధించి 60శాతం నిధులు రూపంలో మూడున్నర లక్షల కోట్లు నిధులను మళ్లించారని అవి ఎక్కడికి వెళ్లాయో కూడా లెక్కలు లేవని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత 1.30 లక్షల కోట్లు చెల్లించి కేంద్ర పథకాల నిధులు అమలుకు చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రానున్న జూన్ నుంచి ప్రభుత్వం సూపర్-6 పథకాల్లో భాగంగా హామీల అమలుకు నడుం బిగించిందని, జూన్ 12న 1.20 లక్షల మంది వితంతువులకు పెన్షన్లు మంజూరు చేస్తామని, తల్లికి వందనం పేరుతో స్కూలుకు వెళ్లే పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.15 వేల వంతున సహాయం అందిస్తామని, త్వరలో ఉచిత బస్సు పథకాన్ని కూడా అమలు చేస్తామని చెప్పారు. కోనసీమ జిల్లా అభివృద్ధికి అవసరమైన అన్ని ప్రణాళికలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. టూరిజంతోపాటు ఈ ప్రాంతంలో లభ్యమయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలు పరిష్కరిస్తానని మహానాడు సభావేదికగా అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

### కోనసీమను అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యేలు

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కోనసీమ జిల్లాను కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లాలకు ధీటుగా అభివృద్ధి చేయాలని, ఎయిర్‌పోర్టు నిర్మించాలని, పర్యాటకంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి ప్రణాళికలను ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కోనసీమలో లభ్యమయ్యే మత్స్య సంపద ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సహకాలు అందించాలని, పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చి పదవుల్లో నియమింపజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ వ్యవసాయా ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమలో పంటకాల్వలు, డ్రెయిన్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, దశాబ్దాల కాలంగా వాటికోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుతో పాటు కోనసీమ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ పనిచేస్తున్న గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయిలో ఉన్న కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అముడా చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు నివేదికను సమర్పించారు. సమావేశానికి తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం మహానాడు సభ ప్రారంభమైంది. ఈ సభలో టీడీపీకి చెందిన జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యేలు చిల్లా జగదీశ్వరి, అయితాబత్తుల బుచ్చిమహేశ్వరరావు, చెల్లి వివేకానందతోపాటు టీడీపీ నాయకులు మోకా ఆనందసాగర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి పూర్ణిమ, నాగిడి నాగేశ్వరరావు, బోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అచ్చెన్నాయుడు సమక్షంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బో నం సత్తిబాబు ఆధ్వర్యంలో టీడీపీ నేత మెట్ల రమణబాబుకు పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సభా వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అచ్చెన్నాయుడు, నేతలు

## మహానాడులో 11 తీర్మానాలు ఆమోదం

కోనసీమ జిల్లా మహానాడు సమావేశంలో 11 తీర్మానాలపై నాయకులు చర్చించి ఆమోదం తెలిపారు. ఒక్కో తీర్మానాన్ని ఒక్కో నాయకుడు ప్రతిపాదించగా సభ ఏకగ్రీవంగా వాటిని ఆమోదించింది. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరవీరులైన సైనికులకు, లోక్‌సభ పరిధిలో మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించారు. సంస్థాగత ఎన్నికలపై చర్చించే తీర్మానానికి ఆమోదం తెలిపారు. జిల్లాస్థాయిలో టీడీపీ భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ గురించి చర్చించి తీర్మానాన్ని ఆమోదించారు. సూపర్-6 పథకాలతో పాటు కోనసీమ జిల్లాలో రైల్వేలైన్ నిర్మాణంతో పాటు అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి పలు అంశాలపై మహానాడు ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించింది. భారీగా టీడీపీ శ్రేణులు హాజరయ్యారు.



ఎమ్మెల్యేలు..



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్

## 202వ అన్న క్యాంటీన్ అమలాపురంలో ప్రారంభం

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాలతో పాటు ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్రంలో 202వ అన్న క్యాంటీన్‌ను అమలాపురంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన పండుగ వాతావరణంలో గురువారం మధ్యాహ్నం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అన్న క్యాంటీన్ ద్వారా రూ.5కే భోజనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని నాణ్యంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయడం జరగిందని, మరో 70 క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం ఇచ్చిందని, త్వరలోనే టెండర్లు పిలుస్తున్నట్టు మంత్రి తెలిపారు. మొత్తం 175 నియోజకవర్గాల్లో పట్టణాల్లో ఎక్కువ ఉన్న ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఒకటికి తగ్గకుండా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. భోజన సదుపాయాల నిర్వహణపై ఒక కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు సొసైటీని కూడా నియమించామన్నారు. ఈ క్యాంటీన్ల ద్వారా దాతల దానంతో పేదలకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేయవచ్చునని, అలాగే పుట్టినరోజు జరుపుకుంటే ఆరోజు అన్న క్యాంటీన్‌కు అయ్యే ఖర్చును భరిస్తే వారి పేరిట భోజన సదుపాయం అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యానాగేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.



మహానాడులో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం



మహానాడులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి

## పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి : కలెక్టర్

అమలాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయిలో మండల విద్యాశాఖాధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. బడి మానివేస్తున్న వారి సంఖ్యను తగ్గించాలని, అలాగే ఉపాధ్యాయులకు పని భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ప్రవేశ పెట్టిందని, ఆ దిశగా జూన్ 12 నాటికి ఆ పాఠశాలలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సర ప్రారంభానికి పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తిచేసి తరగతి గదులను సిద్ధం చేయాలని, పాఠ్య పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్లస్టర్ అకాడమిక్ టీచర్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, నూతన విద్యా విధానం విద్యాహక్కు చట్టం ప్రకారం ఆదర్శ ప్రైమరీ పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక గది ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 25 నాటికి ప్రధానమంత్రి శ్రీపథకం కింద మంజూరైన మొదటి దశ పనులను పూర్తిచేసి రెండో దశ పనులు జూన్ 5 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎంఈవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో షేక్ సలీంబాషా, సర్వశిక్షా సహాయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మమ్మీ, వీవీ సుబ్రహ్మణ్యంతోపాటు ఎంఈవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కలలోను!




## కార్పొరేషన్ రుణాలకు స్మాల్ బ్రేక్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా ఇవ్వనున్న స్వయం ఉపాధి రుణ యూనిట్లకు బ్రేక్ పడింది. వీటిని తక్షణం నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ, రుణం మంజూరు ఆపేయాలని సూచించింది. త్వరలో భారీగా అదనపు రుణ యూనిట్లు, లబ్ధిదారులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.




### వందల్లో యూనిట్లు.. వేలల్లో దరఖాస్తులు

ఐదేళ్ల తర్వాత మళ్లీ పథకం అమల్లోకి రావడంతో యూనిట్లు వంద ల్లో ఉంటే దరఖాస్తుదారులు వేలల్లో వచ్చారు. బీసీ కార్పొరేషన్ రుణాల కింద కాకినాడ జిల్లాకు రూ.39.52 కోట్ల విలువైన 1,914 యూనిట్లు మంజూరు చేస్తే ఏకంగా 31,859 మంది, తూర్పుగోదావరి జిల్లాలో రూ.28.87 కోట్ల విలువైన 1,374 యూనిట్లకు 16,408 మంది, కోనసీమ జిల్లాలో రూ.29.54 కోట్ల విలువైన 1,394 యూనిట్లకు 15,147మంది పోటీపడ్డారు.కాపు కార్పొరేషన్ కింద రూ.28.24 కోట్ల విలువైన 763 యూనిట్లకు 21,454, తూర్పుగోదావరి జిల్లాలో రూ.27.15 కోట్ల విలువైన 757 యూనిట్లకు 8,193 మంది, కోనసీమ జిల్లాలో రూ.27.14 కోట్ల విలువైన 757 యూనిట్లకు 15,644 మంది పోటీ పడ్డారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద ఉమ్మడి జిల్లాకు రూ.14 కోట్ల విలువైన 511 యూనిట్లు మంజూరు చేయగా, రూ.6 వేల మంది వరకు దరఖాస్తులు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ కింద కాకినాడ జిల్లాకు 798 యూనిట్లు మంజూరవగా 5,497, కోన సీమ జిల్లాకు 1,043 యూనిట్లకు 3,265 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 891 యూనిట్లకు 4,555 మంది దరఖాస్తు చేశారు.

### 5,137 యూనిట్లు..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేదలకు ఒక్క యూనిట్ కూడా మంజూరు చేయకుండా ఆపేసింది. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ఇటీవల వీటిని పునరుద్ధరించింది. సీఎం చంద్రబాబు మళ్లీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, కాపు, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వ్యాపారాన్ని బట్టి ప్రభుత్వం 40 నుంచి 60 శాతం సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణం, ఐదు శాతం వరకు లబ్ధిదారుడి వాటా కింద విభజించారు. ఈ రెండు కార్పొరేషన్ల ద్వారా రూ.316 కోట్ల విలువైన స్వయం ఉపాధి యూనిట్లను పేద యువతకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు నిర్ణయించింది. బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఉమ్మడి జిల్లాకు 5,137 యూనిట్లను మంజూరు చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. ఏకంగా 45,765 మంది పోటీపడ్డారు. అనేకమందికి పథకం అందని పరిస్థితి నెలకొంది. ఈ నేప థ్యంలో మళ్లీ యూనిట్లను పెంచి మరింత మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం అర్హుల ఎంపికను నిలిపివేసి కొత్తగా మరింత మందిని ఎంపిక చేసి అందరికీ ఒకేసారి ఈ పథకం అమలు చేయడం కోసమే తక్షణ నిర్ణయమని చెబుతున్నారు.


### లబోదిబో...

ఐదేళ్ల తర్వాత పథకం అమలవుతుండడంతో యూనిట్లను దక్కించుకునేందుకు వేలాదిగా పోటీపడడంతో కేవలం వందల్లో మాత్రమే లబ్ధిదారులు రుణాలకు ఎంపికయ్యారు. ఎంపిక కాని వేలాది మంది పేద యువత, నిరుద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ అనేక చోట్ల ఎమ్మెల్యే వద్దకు క్యూ కట్టారు. ఇన్నేళ్లు నిరీక్షిస్తే తమకు ఇంకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ విజ్ఞప్తులు అందించారు. దీంతో

- కలవరింత... పెంపు మరింత
- జాబితాలు నిలిపేయాలని ఆదేశం
- యూనిట్లు తక్కువవడమే కారణం
- కార్పొరేషన్లకు 5,137 యూనిట్లు
- 45,765 దరఖాస్తులు
- వందల్లో ఎంపికైన లబ్ధిదారులు
- అనేక మందికి దక్కని అవకాశం
- ఎమ్మెల్యేలను నిలదీస్తున్న వైనం
- పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి
- త్వరలో భారీగా పెంచే యోచన
- యూనిట్ల పెంపుపై కసరత్తు
- అందుకే నిలిపివేసిన ప్రభుత్వం

అనేక మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వందల్లో రుణ యూనిట్లు సరిపోవని వివరించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులపై అధికారుల ద్వారా నివేదిక రప్పించుకున్న ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కేటాయించిన యూనిట్లు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇవి రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందనే చర్చ ప్రభుత్వంలో జరిగింది. రెట్టింపు చేయాలా? ఇంకా పెంచాలా? అనేదానిపై ప్రస్తుతం ఉన్నత స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఈ సంగతి తేల్చే వరకు ఇది వరకే ఎంపిక చేసిన లబ్ధి దారుల జాబితా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. పెంచబోయే యూనిట్లను కలిపి అందరికే ఒకేసారి పథకం వర్తింపజేయాలని జిల్లాల్లో అధికారులకు సమాచారం అందింది. దీంతో ప్రస్తుతం మండల స్థాయిలో పథకాలకు ఎంపికై బ్యాంకు రుణాలకు ఎదురుచూస్తోన్న లబ్ధిదారులను హోల్డ్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ కింద మంజూరైన 1,042, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ కింద మంజూరైన 73, కాపు కార్పొరేషన్ కింద ఎంపికచేసిన 570 లబ్ధిదారులను నిలిపివేశారు. త్వరలో భారీ స్థాయిలో యూనిట్లను పెంచి ఎక్కువమంది యువతకు పథకాన్ని అమలుచేయనుంది.

# కిలో నెయ్యి.. రూ.250



కల్తీ నెయ్యి

## ఆత్రేయపురం పూతరేకుల్లో కల్తీ నెయ్యి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- పూతరేకుల్లో వినియోగం
- పశువుల కొవ్వు నుంచి తయారీ
- చిరు వ్యాపారులతో అమ్మకాలు
- ప్రజారోగ్యంతో చెలగాటం

ఆత్రేయపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది పూతరేకులే.. రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం.. ఆ వ్యాపారానికి నెయ్యి ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే నెయ్యి వాడని పూతరేకు ఉండదు. ఎన్నో ఏళ్ల కిందట ఆత్రేయపురంలో పుట్టిన పూతరేకుకు దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. మహిళలు కుటీర పరిశ్రమగా పూతరేకులు తయారుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పూతరేకులకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ పూతరేకుల వ్యాపారాలు సాగిస్తూ కల్తీ నెయ్యి వినియోగిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలో రోడ్ల వెంబడి ఉన్న దుకాణాల్లో కొందరు వ్యాపారులు గత కొంతకాలంగా యథేచ్ఛగా నకిలీ నెయ్యిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. పశుమాంసం ద్వారా కొవ్వును తీసి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒరిజినల్ నెయ్యిలా ఉండేలా కొన్ని మిశ్రమాలు కలిపి ఈ కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నట్టు సమాచారం. ఏలూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ నకిలీ నెయ్యిని తెచ్చి వ్యాపారుల ద్వారా అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురంలోని కొన్ని షాపుల ద్వారా ఈ నెయ్యి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ కల్తీ నెయ్యిని కిలో రూ.250కు చిరువ్యాపారులకు విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండడం.. చూస్తే నెయ్యిలా కనిపించడంతో ఆ నెయ్యినే వినియోగించి కొందరు పూత రేకులు తయారుచేస్తున్నారు. ఈ కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగించడం ద్వారా ప్రజలు ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. క్యాన్సర్, ఉదర సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నెలలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పూతరేకుల తయారీ, నెయ్యి వ్యాపారుల స్థావరాలపై దాడులు చేసి కేసులు పెట్టినా షరామామూలే.



అధికారులు పట్టుకున్న కల్తీ నెయ్యి

### 80 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ఆత్రేయపురంలోని కల్తీ నెయ్యి అమ్మకాలు సాగిస్తున్న ఓ షాపుపై స్థానికులు గుర్తించి పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అం దించారు. ఆత్రేయపురం శ్రీలక్ష్మి డ్రైఫూట్స్ షాపులో గురువారం 80 కిలోల కల్తీనెయ్యిని పట్టుకుని స్థానికులు పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. షాపునకు చెందిన గొడౌన్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 80 కిలోల కల్తీనెయ్యిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రాము ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌చౌదరి కల్తీ నెయ్యి సీజ్ చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.




సంచుల్లో నిల్వ ఉంచిన కల్తీ నెయ్యి ప్యాకెట్లు

## జలకాలాటలలో...

నగరాలు, పట్టణాల్లో ఉండే పిల్లలకు ఎంజాయ్ చేయడానికి స్విమ్మింగ్ పూల్స్ ఉంటాయి... మరి మారుమూల పల్లెల్లో నివసించే పిల్లలకు చెరువులు, కాలువలే ఆధారం... ఈ చిత్రం చూస్తే అలానే అనిపిస్తోంది కదూ... కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటకు చెందిన కుర్రాళ్లు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఊరి చివరన ఉన్న ఓ పురాతన బావిలోకి దూకి ఇలా స్నానాలు చేస్తూ సందడి చేశారు.







ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ. చిత్రంలో కలెక్టర్ షాన్‌మోహన్, పెద్దాపురం, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు చినరాజప్ప, నానాజీ, ఎమ్మెల్సీ పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ కమిషనరు భావన

## ఏలేరు కాల్వల గండ్లు అన్నింటినీ
# వర్షాకాలానికి ముందే పూడ్చాలి

- గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పూర్తి చేశారు
- పీఎం సూర్యఘర్ కింద 75వేల గృహాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలి
- కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ

కలెక్టరేట్ (కాకినాడ), మే 22 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం వరదల కారణంగా ఏలేరు వ్యవస్థలో కాల్వలకు పడిన గండ్లు అన్నింటినీ వర్షాకాలానికి ముందే పూడ్చాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలతో కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. గత డీఆర్సీ సమావేశంలో చర్చించిన అంశాల్లో 75శాతం పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తిచేస్తామని కలెక్టర్ వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి పథకం కింద 75వేల సోలార్ రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటు చేసామన్నారు. దీనిలో 52వేల యూనిట్లను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇస్తామన్నారు.

కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ల వల్ల రైతులకు, డ్రోన్ నిర్వాహకుడికి ఏడాదికి దాదాపు 6.33లక్షల ఆదాయం చేకూరుతుందని అధ్యయనంలో నిర్ధారణ అయ్యిందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల యజమానికి చేకూరే ఆర్థిక ప్రయోజనాలపై క్షేత్ర పరిశీలన చేశామన్నారు. డ్రోన్ల వినియోగం వలన రైతులకు ఖర్చు, సమయం ఆదా అవుతున్నాయన్నారు. జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, నైపుణ్యాల శిక్షణ, ఉద్యోగమేళాల నిర్వహణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చేపట్టిన చర్యలను మంత్రికి కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ఆవాసాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టిన చర్యలను కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వివరించారు.

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ గత ఏడాది వరదల వలన ఏలేరు వ్యవస్థలో పడిన గండ్లను వెంటనే పూడ్పించాలన్నారు. సామర్లకోట బైపాస్, ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను సత్వరం పూర్తి చే యాలన్నారు.

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆక్వా చెరువుల వ్యర్థ జలాల వలన పంట పొలాలకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధర చెల్లిస్తున్నందున నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు మరింత ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లను రైతులకు పంపిణీ చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న హాస్టల్ సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. జయలక్ష్మి మాక్ సొసైటీ, కిర్లంపూడి, ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై సత్వరం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ సభ్యులు సమావేశంలో చర్చించిన అంశాలపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఏలేరు సాగునీటి వ్యవస్థలో కాలువలకు గత ఏడాది వరదల సమయంలో పడిన గండ్లు అన్నింటినీ ఖరీఫ్ సాగుకు ముందే పూడ్చాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద టిడ్కో గృహాలపైన కూడా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. పటిష్టమైన వేసవి కార్యాచరణతో బోర్లు రిపేర్లు, నీటి రవాణా వంటి చర్యలతో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అమ్మే ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలన్నారు. రైతులకు మరిన్ని టార్పాలిన్లు సబ్సిడీపై సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాల్లో 75 శాతం పరిష్కారం అయ్యాయని చెప్పారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

## పాపికొండలు నేషనల్ పార్కులో
# ఎకో అటవీ పరిరక్షణ జోన్

- అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమావేశం

రంపచోడవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు నేషనల్ పార్కులో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఎకో అటవీ పరిరక్షణ జోన్ ఏర్పాటు చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన రంపచోడవరంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎన్ఎన్ మూర్తి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్ర ధామ, భవిత జిల్లా స్థాయి అధికారులతో కలిసి పాపికొండలు నేషనల్ పార్కు విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపికొండలు నేషనల్ పార్కు ఏర్పాటుకు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల్లోని 10 గ్రామాలు, చింతూరు డివిజన్లో 12 గ్రామాలు ఉన్నట్టు తెలిపారు. గ్రామసభలు ఏర్పాటుచేసే గ్రామాల ప్రజలకు ముందుగా నోటీసులు జారీ చేయా లన్నారు. నేషనల్ పార్కు ప్రాంతంలో ఎన్ని కుటుంబాలకు అవార్డులు మంజూరైంది.... ఇంకా ఎన్ని కుటుంబాలకు మంజూరు కావాల్సి ఉందో తెలపాలన్నారు. త్వరితగతిన గ్రామసభలు నిర్వహించాలని డీఎల్పీవో పద్మను ఆదేశించారు. సమావేశంలో సబ్ డీఎఫ్‌వోలు అనూష, రాఘవ, అటవీ రేంజ్ అధికారులు ఏడుకొండలు, ఫిరోజ్, డి.కొండలరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, డీఈ సాయిసతీష్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఎన్జీవో ప్రతినిధి గొర్లె అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ, అటవీ, వివిధ శాఖల అధికారులు

# దేవాలయాలకు త్వరలో ధర్మకర్తలు

- దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం
- వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో ధర్మకర్తల నియామకం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుతగా అర్చక బృందం ఆలయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు మంత్రిని సత్కరించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంత్రికి స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రథశాలకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవదాయ శాఖలో మూడు స్థాయిల్లో కమిటీల నియామకం మరో పదిరోజుల్లో జరుగుతాయన్నారు. తొలివిడతగా ఏసీ స్థాయి, గ్రేడ్-1 స్థాయి కమిటీల నియామకం జరుగుతుందని, తద్వారా మిగిలిన కమిటీలు త్వరగా నియామకం చేస్తామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తజనంతో విరజిల్లుతున్న వాడపల్లి క్షేత్రంపై క్యాబినెట్‌లో చర్చించారన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. త్వరలోనే దేవదాయ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మద్దూరి సుబ్బారావు, పి.పుల్లంరాజు వర్మ, జుజ్జవరపు హరిబాబు, మద్దింశెట్టి సత్యనారాయణ, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము, తహశీల్దారు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన ఐటీఐ విద్యార్థి

- సత్కరించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



ఐటీఐ విద్యార్థి, డీసీపీయూ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గత మంగళవారం ఏ దిక్కు లేకుండా ముగ్గురు చిన్నారులతో కలిసి వర్షంలో ఆకలితో ఉన్న రామలక్ష్మిని చూసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుందూరుకు చెందిన ఐటీఐ విద్యార్థి వనుము పరమేశ్వర్ చలించిపోయాడు. ఈ విషయమై జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి(డీసీపీయూ) సమాచారం ఇవ్వడంతో ఆ మహిళతో పాటు ముగ్గురు చిన్నారులను జీజీహెచ్ వద్ద ఉన్న వన్‌స్టాప్‌కు తీసుకెళ్లి సపర్యలు చేసి చికిత్స అందించారు. బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు సఖి వన్ స్టాప్ సెంటర్‌కు తరలించి సంరక్షణ కల్పించారు. విషయం తెలుసుకున్న ఐటీఐ విద్యార్థి పరమేశ్వర్, ప్రొటెక్షన్ అధికారి విజయలను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం సత్కరించారు. ఆపదలో ఉన్న మహిళ, చిన్నారుల దుస్థితిని చూసి వెంటనే స్పందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి, సోషల్ వర్కర్ చినబాబు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

### యువతకు స్కిల్ హబ్‌లో
## ఉద్యోగ, ఉపాధి శిక్షణ

రాజమహేంద్రవరం కల్చరల్ మే 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ భవన ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారికి అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ వృత్తి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తరగతులు త్వరలో ప్రారంభమౌతున్నాయని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరు రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అర్బన్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎన్.రాజా కాలేబ్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు జరిగే ఈ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి, ఆపై విద్యార్హతలు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు ఫ్యాకల్టీ మోత కనకదుర్గ మహాలక్ష్మిని, 62811 14627, 95537 94729 నెంబర్లతో సంప్రదించాలని తెలిపారు.

## ఇంజనీరింగ్ పరీక్షకు 115 మంది గైర్హాజరు

జేఎన్టీయూకే, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు గురువారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

కాకినాడ జిల్లాలోని 5 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 901 మంది విద్యార్థులకు 871 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 898 మంది విద్యార్థులకు 865 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 96.50 శాతం విద్యార్థులు పరీక్ష రాశారు.

తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 998 మంది విద్యార్థులకు 970 మంది హాజరై 28 మంది గైర్హాజరు కాగా 97.19 శాతం హాజరు నమోదైంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 807 మంది విద్యార్థులకు 783 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. 97.03 శాతం హాజరు నమోదైంది. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయని కన్వీనర్ సుబ్బారావు చెప్పారు.

## సరస్వతి పుష్కరాలకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు

- డిపో మేనేజర్ షేక్ షబ్నం



రాజమహేంద్రవరం అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి రెండు సూపర్‌లగ్జరీ బస్సులు బయలుదేరి వెడుతున్నాయని డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ యాత్రలో కాళేశ్వరం, ధర్మవరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్పక్షేత్రాలను దర్శించుకుని తిరిగి 25వ తేదీ రాజమహేంద్రవరం చేరుకుంటాయని ఆమె పేర్కొన్నారు.

## బిడ్డ కోసం తల్లి ఆవేదనే 'జనరల్ బోగీలు'

- ప్రేమానురాగాల విలువను తెలియజేసిన 'కిడ్నాప్'
- రామవరంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు



జనరల్ బోగీలు నాటికలో ఓ సన్నివేశం

అనపర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో బుధవారం రాత్రి ప్రదర్శించిన సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు, ఉషోదయా కళానికేతన్ వారు ప్రదర్శించిన కిడ్నాప్ నాటికలు ఆకట్టుకున్నాయి. జనరల్ బోగీలు నాటికలో.. కొడుకు ప్రయాణిస్తున్న రైలు ప్రమాదానికి గురై అతడి ఆచూకీ లభించదు. బిడ్డ ఆచూకీ కోసం ఓ తల్లి ఐదేళ్ల పాటు పోరాటం సాగించి అనేక అవమానాలు ఎదుర్కోవడంతోపాటు చివరకు చెరశాలకు వెళుతుంది. ఈ నాటికను కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ సం స్థ అద్భుతంగా ప్రదర్శించింది. కొడుకు ఆచూకీ కోసం పోలీసులకు ఆమెకు జరిగిన సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

భర్తను కొంగున కట్టుకుని, వృద్ధులైన అత్తమామలను నిత్యం ఏదో సాకుతో బాధ పెడుతుంది కోడలు. చివరకు వారు వేరు కాపురం పెడతారు. వియ్యంకుడు కూడా తన కూతురికి మాయ మాటలు చెబుతూ ఆర్థిక అవసరాలకు వాడుకుంటాడు. ఇదంతా నిశితంగా గమనిస్తున్న మనుమడు తన తల్లికి, తాతకు బుద్ధి రావాలని నాటకమాడి జ్ఞానోదయం కలిగించడమే కిడ్నాప్ సారాంశం. కట్రపాడుకు చెందిన ఉషోదయా కళానికేతన్ సంస్థ ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## కొండ దిగి వెళ్లకపోతే
# క్రిమినల్ కేసులు పెడతాం!

- అన్నవరం దేవస్థానంలో సేవకు వచ్చిన మంచిర్యాల భక్తులతో ఏఈవో దురుసు ప్రవర్తన
- 'ఏబీఎన్' కథనంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ ఆరా
- స్టేట్‌మెంట్ రికార్డు, వివరాలు సేకరించిన ఈవో



కాకినాడ జిల్లా అన్నవరంలో ఈవోకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): వారంతా రాష్ట్రం దాటి అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చారు. మధ్యవర్తి ద్వారా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున దేవస్థానంలో రెండ్రోజులు సేవ నిర్వహించారు. ఈ సమయంలో కొందరు మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయం అన్నవరం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లగా, ఆయన దురుసుగా మాట్లాడి కొండ దిగి వెళ్లకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించారని మహిళలు ఆరోపించారు. దీనిపై 'ఏబీఎన్'లో కథనం ప్రసారం కావడంతో పంచాయితీ.. ఇంటెలిజెన్స్, సీఎం కార్యాలయానికి చేరుకుంది. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల నుంచి 17 మంది మహిళలు, మరొక వ్యక్తి ఈ నెల 19న ఒక మధ్యవర్తి(మహిళ) ద్వారా కాకినాడ జిల్లా తునికి చెందిన శ్రీవారి సేవా సంఘం తరఫున అన్నవరం దేవస్థానంలో ఈ నెల 20, 21 తేదీల్లో రెండ్రోజులపాటు సేవ చేశారు. ఈ సమయంలో తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన ఇద్దరు మహిళలకు, మంచిర్యాల నుంచి వచ్చిన మహిళలకు చిన్నపాటి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రైలు ప్రయాణానికి రానుపోను ఖర్చులతోపాటు ఇతర ఖర్చుల కింద వేలల్లో చెల్లించామని మంచిర్యాల మహిళలు చెప్పడంతో ఈ విషయం బుధవారం సాయంత్రం దేవస్థానం ఏఈవో కొండలరావు దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే మంచిర్యాలకు చెందిన మహిళలపై మండిపడ్డారు. ఇలాంటి వ్యవహారాలు ఇక్కడ కుదరవని, తక్షణం కొండ దిగి వెళ్లిపోవాలని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరించడంతో వారు వెంటనే కొండ దిగి దేవస్థానానికి చెందిన సత్రంలో గదులు అద్దెకు తీసుకున్నారు. ఈ వ్యవహారంపై 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రసారమైంది. దీంతో సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగి దేవస్థానం ఈవోను వివరణ కోరారు. దీంతో ఈవో సుబ్బారావు ముందుగా మంచిర్యాల నుంచి వచ్చిన మహిళల వద్దకు ఆలయ సహాయ కమిషనర్, సీహెచ్ రామ్మోహనరావు, సూపరెంటెండెంట్ రమణను పంపించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఈవో కార్యాలయం వద్దకు తీసుకొచ్చి దేవస్థానం డీసీ, ఏఈవో సమక్షంలో వారి నుంచి వివరాలు సేకరించారు. సేవ చేసేందుకు వచ్చిన తమను అవమానకరంగా చూశారని, తమకు తిరుగు ప్రయాణం టికెట్లు కొంతమందికి 25వ తేదీ, మరికొంతమందికి 27వ తేదీన ఉన్నాయని తెలిపారు. అప్పటివరకు తమను సేవకులుగా కాకుండా భక్తులుగా అయినా ఉంచాలని కోరినా తుని శ్రీవారి సేవా సంఘానికి చెందిన రమ, విజయ అనుచితంగా ప్రవర్తించారని, వారికి ఏఈవో కొండలరావు వత్తాసు పలకడమే కాకుండా, వెంటనే కొండదిగి వెళ్లకపోతే మీకు ఎక్కడా సేవ దొరక్కుండా చేస్తామని బెదిరించారని ఈవోకు వివరించారు. దీంతో వారిద్దరిపై కేసులు నమోదు చేస్తామని, దేవస్థానం డార్మెటరీలో బస, భోజన ఏర్పాటు కల్పిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో శాంతించారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో
# విజేతలుగా ఉమ్మడి జిల్లా జట్లు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. చిత్తూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర 10వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొన్నాయి. వరుసగా ఐదోసారి బాలబాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజేతలకు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయుడు, టెక్నికల్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు షీల్డులు అందజేశారు. విజేతలను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మురాలశెట్టి సునీల్‌కుమార్, పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, కె.సుందరకుమార్ అభినందించారు.



చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

## సత్యదేవుడికి ప్రముఖుల ప్రత్యేక పూజలు

అన్నవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, సినీనటుడు సాయి కుమార్ కుటుంబసభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


మంత్రి కొల్లు రవీంద్రకు స్వామి వారి ప్రసాదం, మెమెంటో అందజేస్తున్న ఈవో


సత్యదేవుడి దర్శనానంతరం సినీనటుడు సాయికుమార్



## అన్నవరం అందాల హరివిల్లు మయం

కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి తూర్పురాజగోపురం వద్ద నల్లని మబ్బుల నడుమ అందాల హరివిల్లు ఆవిష్కృతమై భక్తులను కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది

అన్నవరం (ఆంధ్రజ్యోతి)

### గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి గల్లంతైన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన మేరుగు శ్యామ్ (19) మృతదేహం లభ్యమైంది. సోమవారం శ్యామ్, మరో ఇద్దరు సముద్రంలోకి తెప్పపై వేటకు వెళ్లగా కెరటాల ఉధృతికి శ్యామ్ గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. తెప్ప తిరగబడిన చోటే గురువారం శ్యామ్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

### పాడుబడిన బావిలో మృతదేహం

గోకవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో కోనేరు మధ్యలోని పాడుబడిన బావిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. సుమారు 15 నుంచి 20రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు 45 నుంచి 50 ఏళ్లలోపు ఉండవచ్చన్నారు. స్థానికంగా లేక చుట్టుపక్కల ప్రాంతంలో ఆచూకీ లేకుండా ఉన్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు.

### పాముకాటుకు మహిళ మృతి

అమలాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు ఓ మహిళ మృతి చెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోనంగివారిపేటలో గురువారం ఉదయం కొబ్బరితోటలో బహిర్భూమికి వెళ్లిన జల్లి రామలక్ష్మిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు అల్లవరం ఎస్‌ఐ టి.తిరుమలరావు తెలిపారు.

### బావమరిదిని నరికిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

దేవరపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బావమరిదిని నరికిన కేసులో వ్యక్తికి జైలు శిక్ష పడింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగరాయ కాలనీ బందపురం గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ తన భార్య కాపురానికి రావడంలేదని కోపంతో దానికి కారణమైన తన బావమరిది షేక్ కరీమ్‌ని 2017లో కత్తితో నరికాడు. దీనిపై ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కొవ్వూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు నందు చార్జ్‌షీట్ ఫైల్ చేయగా సాక్షుల విచారణ అనంతరం కేసు రుజువుకావడంతో నిందితుడికి గురువారం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకులపాటి వెంకట్రామణ వాదించగా ప్రాసిక్యూషన్‌కు దేవరపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, కోర్టు కానిస్టేబుళ్లు సహకరించారు.

### కాపవరం సర్పంచ్‌పై మూడు కేసులు

బిక్కవోలు, మే22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.విజయలక్ష్మిని వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వైసీపీ సర్పంచ్ సత్యం శెట్టి వెంకటరమణపై మూడు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఈ కేసును రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య విచారణ చేపట్టిన విషయం విదితమే. పంచాయతీ కార్యదర్శి పట్ల అసభ్యకరంగా మాట్లాడంపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు.. కార్యదర్శి విధులకు ఆటకం కలిగించడంపై సెక్షన్ 353.. కార్యదర్శిని వేధించినందుకు సెక్షన్ 506 కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

# దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం

## పది మందికి గాయాలు

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్
- రాజానగరం వద్ద ఘటన
- క్షతగాత్రుల స్వగ్రామం ఏలూరు జిల్లా చెక్కపల్లి




సంఘటనా స్థలంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

రాజానగరం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో హైవేపై ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన పది మంది గాయపడారు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన నాగుల వెంకటేశ్వరరావు, నాగుల రాజ్యలక్ష్మి, బి.రఘుబాబు, బి.లక్ష్మీదుర్గ, తాళం రాధ, బి.దేవిక, బి.లోకేశ్వరరావు, బి.దేవేంద్ర, ఎస్.పావని ఒకే కుటుంబానికి చెందిన బంధువులు. వారంతా టాటా మ్యాజిక్ వ్యాన్‌లో కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో రాజానగరం సమీపానికి వచ్చేసరికి హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్నవారంతా గాయపడ్డారు. డ్రైవర్ చింతలచెరువు మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో రాజ మహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించినట్టు రాజానగరం పోలీసులు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించినట్టు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు. వ్యాన్ డ్రైవర్ రెప్పపాటు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## పిఠాపురంలో
# కారు బీభత్సం

- అతివేగంగా వచ్చి మోటార్‌సైకిళ్లను ఢీకొనడంతో ధ్వంసం
- జాతీయ క్రీడాకారుడు సహా ముగ్గురికి తీవ్ర గాయాలు

పిఠాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌లో 216వ హైవేపై పాదగయ సెంటర్ వద్ద కారు బీభత్సం సృష్టించింది. మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లడంతో ధ్వంసమై ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటన వాహనదారులను భీతావాహులను చేసింది. పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన పోల్‌వాల్ట్ జాతీయ క్రీడాకారుడు పి.కృష్ణ, ఏడిద వెంకటేష్‌లు చిత్రాడలో జరిగిన బి.ప్రత్తిపాడుకు చెందిన కె.మహేంద్ర పెళ్లికి వెళ్లి సామర్లకోట రోడ్డు నుంచి మోటార్‌సైకిళ్లపై తిరిగి వస్తున్నారు. విశాఖపట్టణం నుంచి కాకినాడ వస్తున్న కారు అతివేగంగా రావడంతో పాటు అదుపుతప్పి వారిని ఢీకొని పాదగయ వద్ద పార్కింగ్‌లో ఉన్న మోటార్‌సైకిళ్లపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వప్రవేటు ఆసుపత్రులకు తరలించారు. మహేంద్ర పరిస్థితి విషమంగా ఉంది. పార్కింగ్‌లో ఉన్న 5 మోటారు సైకిళ్లు దెబ్బతిన్నాయి. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బీభత్సం సృష్టించిన కారు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

# జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిరాభివృద్ధి

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్
- జైలులో జీవ వైవిధ్య దినోత్సవం


జైలులో మొక్కలు నాటుతున్న రాహుల్


వరి కంకుల కుచ్చులను కడుతున్న అధికారులు

రాజమహేంద్రవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య సంరక్షణతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సెంట్రల్ జైలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ గతేడాది సెంట్రల్ జైలుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య పురస్కారం లభించిందని గుర్తుచేశారు. చారిత్రాత్మకమైన రాజమండ్రి సెంట్రల్ జైలులో జీవ వైవిధ్య సంరక్షణకు ఖైదీలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జైలులో వివిధ చెట్ల నుంచి రాలుతున్న ఆకులు, పువ్వులను నిత్యం సేకరించి సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నామన్నారు. వర్మీ యార్డులో వర్మీ కంపోస్టు కూడా తయారవుతోందన్నారు. వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను వివిధ రకాలుగా ఉపయోగిస్తున్నామన్నారు. 200 ఏళ్లకు పైబడిన చెట్లు కేంద్ర కారాగార ఆవరణలో ఉన్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంరక్షిస్తున్నామన్నారు. పచ్చదనం పరుచుకోవడంతో ఉడతలు, గోరింకలు, రామ చిలుకలు, కాకులు, కోయిలలు వంటి జీవాలు ఇక్కడ స్వేచ్ఛగా సంచరిస్తున్నాయని చెప్పారు. జైలు ఆవరణలో ఖైదీలతో మొక్కలు నాటించారు. పక్షుల ఆహారం కోసం వరి కంకుల కుచ్చులను, నీటిని ఏర్పాటు చేయించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు జైలులో ప్రతి రోజూ ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ వెల్లడించారు. డీఎస్ రత్నరాజు, పర్యావరణ మిత్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వ్యాన్ ఢీకొని బాలుడి మృతి

రౌతులపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మోర్తా రమేష్‌బాబు (15) వ్యాన్ ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మెరక చామవరం గ్రామం నుంచి బైక్‌పై గెడ్డం ప్రసాద్, మోర్తా రమేష్‌బాబు వస్తుండగా రౌతులపూడి శివారు మరిడమ్మతల్లి ఆలయం దగ్గరకు వచ్చేసరికి రౌతులపూడి నుంచి శంఖవరం వెళ్తున్న బొలేరో వ్యాన్ బైక్‌ను ఢీకొనడంతో వెనక ఉన్న రమేష్‌బాబు కిందపడి తలకు బలమైన గాయమైంది. రౌతులపూడి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోర్తా నాగేశ్వరరావు, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రమేష్ బాబు చిన్న కుమారుడు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.


మరణించిన రమేష్‌బాబు(ఫైల్)

# పరీక్ష రాసి ఇంటికెళ్తుండగా..

## ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని తల్లీకూతుళ్లకు తీవ్రగాయాలు

పెద్దాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ ఎగ్జామ్ రాసి తిరిగి ఇంటికెళ్లే క్రమంలో ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను బలంగా ఢీకొని తల్లీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రోడ్డులో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాళ్లరేవుకు చెందిన సాహితి ఈఏపీ సెట్ పరీక్ష రాసేందుకు సూరంపాలెంలోని ఆదిత్య కళాశాలకు తల్లితో కలిసి స్కూటీపై వచ్చింది. పరీక్ష రాసిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. తల్లీకూతుళ్లు తీవ్రగాయాలు అయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఎస్‌ఐ మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన తల్లి

### రోడ్డు ప్రమాదంలో వీఆర్వో భర్త మృతి

వై.రామవరం, మే 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసల పాలెం శివారు కల్వర్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరంలో పని చేస్తున్న వీఆర్వో మిడియం కాంతమ్మ భర్త చోడి సీతారామయ్య (35) మరణించాడు. బుధవారం రాత్రి చవిటి దిబ్బలు వైపు నుంచి వై.రామవరం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెప్తున్నారు. వాహనం అదుపు తప్పిందా లేక వేరే వాహనం ఢీకొందా అనే దానిపై స్పష్టత లేదు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.


మృతిచెందిన సీతారామయ్య

# కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిపై కాలువలోకి లారీ దూసుకెళ్లింది. గురువారం తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ప్రత్తిపాడు సుద్దగడ్డ వాగు వద్ద అయ్యప్పస్వామి మైదానం ఎదురుగా ఉన్న కాలువలోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే అక్కడే 11కేవీ విద్యుత్ లైన్ల విద్యుత్ స్తంభం ఉంది. లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఉంటే ప్రమాదం జరిగేది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.



# ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటు

## ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి

కొత్తపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో టూరిజం స్పాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆంధ్రప్రదేశ్ టూరిజం చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్(ఏపీటీసీఎంవో) పద్మారాణి తెలిపారు. గురువారం ఆమె ఉప్పాడ తీరప్రాంతం, వీవర్స్ కాలనీలో పర్యటించారు. చేనేత కార్మికులు మగ్గాలపై తయారుచేస్తున్న చీరలు, వివిధ రకాల ఆల్బమ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉప్పాడ తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. విశాలమైన తీరప్రాంతంలో అనేకమంది మత్స్యకారులు బోట్లపై జీవనోపాధి పొందడం గుర్తించామన్నారు. ఉప్పాడలో చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి పెంపు, కార్మికుల జీవనోపాధి పెంపొందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరాలను సేకరించి తద్వారా నివేదికను పంచాయతీరాజ్ శాఖకు సమర్పిస్తామని చెప్పారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యంతో ఉప్పాడ గ్రామాన్ని సందర్శించినట్టు చెప్పారు. టూరిజం కన్సల్టెంట్ నిష్తాగోయల్, క్రియేటివ్ డిజైనర్ మణికంఠ, కొత్తపల్లి ఎంపీడీవో పి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, చేనేత కార్మికులు ఉన్నారు.


ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న పద్మారాణి

## మాధవరాయుడుపాలెం
# సర్పంచ్‌కు జీవవైవిధ్య పురస్కారం

కడియం, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక జీవవైవిధ్య పురస్కారం-2025 తూర్పుగోదావరి జిల్లా మాధవరాయుడుపాలెం సర్పంచ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి అన్నందేవుల చంటికి దక్కింది. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జీవవైవిధ్యం కోసం కృషి చేసిన విశిష్ట వ్యక్తులను సత్కరించి పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నందేవుల చంటిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జీవవైవిధ్య పురస్కారం, జ్ఞాపిక అందజేశారు. ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, సోలార్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉపయోగం, రోడ్డుకిరువైపులా మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించడం తదితర అంశాల్లో 25ఏళ్లుగా చేస్తున్న కృషికి గాను చంటికి ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో జీవ వైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, మెంబర్ సెక్రటరీ రామకృష్ణ తదితరులున్నారు.



డిప్యూటీ సీఎం పవన్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న అన్నందేవుల చంటి

## బాలికతో అసభ్య ప్రవర్తన..
# గాజుల వ్యాపారిపై పోక్సో కేసు

సర్పవరం జంక్షన్, మే 22 (ఆంధ్రజ్యోతి): 12ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో వీధిలో తోపుడు బండి వద్దకు తల్లితో కలసి 12 ఏళ్ల బాలిక గాజులు, ఇతర సామాన్ల కొనుగోలు చేసేందుకు వచ్చింది. గాజులు చూస్తుండగా బాలికను వదిలి తల్లి ఇంట్లోకి వెళ్లింది. ఈ సమయంలో తోపుడు గాజుల బండి వ్యాపారి కంచెపు సూర్య ప్రభాకర్ (50) బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఏడుస్తూ ఇంట్లోకి వెళ్లి జరిగిన సంఘటనపై తల్లికి చెప్పింది. సూర్యప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ బి పెద్దిరాజు ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు మహిళా ఎస్‌ఐ లలితాదేవి తెలిపారు.

# అమలాపురం





# వైభవంగా హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర

- భారీగా హాజరైన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ శ్రేణులు
- పట్టణంలో భారీ ర్యాలీ
- వైభవంగా హనుమాన్ జయంతి



పట్టణ పురవీధుల్లో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న శోభాయాత్ర

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర జిల్లా కేంద్రమైన అమలాపురంలో గురువారం హోరెత్తింది. పెద్దసంఖ్యలో హిందువులు ఈ శోభాయాత్రలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు. స్థానిక కళాశాల రోడ్డులో ఉన్న శ్రీవిజయ త్రిముఖగణపతి ఆలయంనుంచి అశేష జనవాహినితో ప్రారంభమైన శోభాయాత్ర ముందు ఎడ్ల బండితో కూడిన హనుమాన్ విగ్రహం ఊరేగింపు, డీజే సౌండ్ల మధ్య పట్టణ పురవీధుల్లో హోరెత్తింది. మారుతీ జియర్‌దాస్ స్వామీజీ పరబ్రహ్మ నందగిరి మాతాజీతోపాటు ముఖ్యఅతిథులుగా పాల్గొనగా ఈ శోభాయాత్రకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కోనసీమజిల్లా శాఖలు ఆధ్వర్యంలో జరిగింది. శోభాయాత్రలో రాళ్లపల్లి పాపయ్యశర్మ, శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్యతోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ప్రముఖులు, వందలాది కార్యకర్తలు జైశ్రీరామ్.. జైహనుమాన్ అంటూ నినాదాలిస్తూ యాత్రలో పాల్గొన్నారు. పోలీసులు ముందు జాగ్రత్తగా శోభాయాత్రకు బందోబస్తు ఏర్పాటు చేశారు. హిందువుల ఐక్యతను చాటుదామంటూ నినదించారు. శోభాయాత్రలో అత్యధికంగా జనం పాల్గొని విజయవంతం చేసినందుకు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

**ముమ్మిడివరం:** హనుమాన్ జయంతిని ముమ్మిడివరం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, కుంభపూజ, ప్రత్యేక అభిషేకాలు, తమలపాకుల పూజ, సింధూరార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టున ఉన్న అభయాంజనేయస్వామివారి ఆలయంలో ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీరామచిరంజీవాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**మలికిపురం:** హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో హనుమాన్ జన్మదినోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తమలపాకుల పూజలు నిర్వహించారు. మోరి నుంచి శోభాయాత్ర చేపట్టారు. మోరి, వియ్యారివారిమెరక, మలికిపురం, టేకిశెట్టిపాలెం మీదుగా అంతర్వేది వరకు శోభాయాత్ర సాగింది.

**ఉప్పలగుప్తం:** హనుమాన్ జయంతిని గురువారం మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సన్నవిల్లి, ఉప్పలగుప్తం, భట్నపాలెం, ఎస్.యానాం, టి.చల్లపల్లి, పెదగాడవిల్లి, ఎన్.కొత్తపల్లి, గోపవరం, కూనవరం, భీమనపల్లి గ్రామాల్లో తమలపాకుల పూజలు, హనుమత్ వ్రతాలు నిర్వహించారు.

**అయినవిల్లి:** అయినవిల్లిలంకలో ఉన్న శ్రీసీతారామాలయంలో ఆవిర్భావ శతాబ్ధి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామివారి మూలవిరాట్‌కు నవకుంబాది ప్రధాన ద్రవ్య దేవతారాధన చేసిన జలములతో అభిషేకం, మహాపూర్ణాహుతి, త్రిషోడశ జీవకళావాహన, గోదర్శనం, స్వామివారికి మహా పట్టాభిషేక మహోత్సవం, వేదాశీర్వచనం నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో దేవదాయ-ధర్మాదాశాఖ కమిషనర్ కె.రామాచంద్రమోహన్, చిట్టూరి వీరవెంకటసత్యనారాయణ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే సిరిపల్లి అభయాంజనేయస్వామి ఆలయంవద్ద విశేష పూజలు నిర్వహించారు.



ముమ్మిడివరంలోని శ్రీఅభయాంజనేయస్వామి

**మామిడికుదురు:** మామిడికుదురులోని అభయాంజనేయస్వామి ఆలయంవద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. బుధవారం ఏకాహదశాహంతలు అభిషేకం, తమలపాకులు, సిందూరంతో విశేషార్చనలు జరిపారు. ఈ కార్యక్రమాలన్నీ సుదర్శనం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం మలికిపురానికి చెందిన పెద్దింటి రామకృష్ణాచార్యులు నిర్వహించిన సుందరకాండ పారాయణం ఆకట్టుకుంది. మగటపల్లిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంవద్ద హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. పాశర్లపూడిలంక, పెదపట్నం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు.

**ఐ.పోలవరం:** ఎదురులంక బ్రిడ్జి వద్ద పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ దంపతులు పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. టి.కొత్తపల్లి, గుత్తెనదీవి గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమాల్లో వైసీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు శ్రీనురాజు, పెన్మెత్స వాసురాజు, బుల్లిరాజు, మోర్త రాఘవులు పాల్గొన్నారు.

**అంబాజీపేట:** హనుమాన్ జయంతి వేడుకలను మండలంలోని పలు ఆలయాలలో ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట పశువుల సంతమార్కెట్‌లో ఉన్న అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. పెద్దవీధిలోని నాగమల్లిచెట్టువద్ద ఉన్న దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు హనుమాన్ ఆలయాలలో లక్షతమలపాకుల పూజ, గంధసిందూరపూజ, అభిషేకాలు చేపట్టారు. స్వామివారిని పురవీధులలో ఊరేగించారు.

**పి.గన్నవరం:** లంకలగన్నవరంలో శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలను గురువారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని నరేంద్రపురం, కె.ముంజవరం, ముంగండ, ముంగండపాలెం, మానేపల్లి, నాగుల్లంక, వాడ్రేవుపల్లి గ్రామాలలో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**అంతర్వేది:** సఖినేటిపల్లి మండలంలో హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రామాలయాలు, హనుమాన్ మందిరాలవద్ద ప్రత్యేక పూజలుచేశారు. మోరి శేషారాయుడు కాల్వగట్టు వద్ద శ్రీపసన్నాంజనేయస్వామి 39వ వార్షికోత్సవం సందర్భంగా ఏకాహభజనలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు. అంతర్వేది ధ్యానాంజనేయస్వామి ఆలయంవద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామికి విశేష పూజలు, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉపాలయంలో ఉన్న శ్రీభక్తాంజనేయస్వామికి ఆలయ అర్చకులు తమలపాకులు, సిందూరంతో అభిషేకాలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. టేకిశెట్టిపాలెం, శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం హనుమాన్ జంక్షన్ తదితర గ్రామాల్లో ఆలయాల్లో భక్తి పాటలతో ఏకాహం నిర్వహించారు.

**రాజోలు:** మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా జరిపారు. శివకోడు, పొన్నమండ, వేగివారిపాలెం, కడలి, తాటిపాక, సోంపల్లి, పొదలాడ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వైభవంగా జరిగాయి. రాజోలులో శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. అమలాపురంలో ఎస్కేబీఆర్ కళాశాల రోడ్డులో త్రిముఖ గణపతి ఆలయం సమీపంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ జన్మదినోత్సవ వేడుకలకు రాజోలు శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి బయలుదేరిన భారీ బైకు ర్యాలీని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాసు శ్రీనివాస్, రాజా నాగరత్నకుమార్, చలువాటి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా



అంతర్వేది: మోరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో



లంకలగన్నవరంలో శ్రీదాసాంజనేయస్వామి



పాతయింజరంలో పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు



అంబాజీపేటలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



రాజోలులో ఆంజనేయస్వామిని దర్శించుకున్న భక్తులు

## భారీ వర్షం

మలికిపురం, మే 22(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లు వర్షపు నీటితో చెరువుల్లా మారాయి. బోదెలు మూసివేయడంతో ముంపునీరుదిగక ప్రజలు ఇబ్బందులకుగురయ్యారు.

## 24న జాబ్‌మేళా

ముమ్మిడివరం, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డవలప్‌మెంట్, ఉపాధి కల్పనా నైపుణ్యాబివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 24న ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి యి.వసంతలక్ష్మి గురువారం తెలిపారు. 11 ప్రముఖ కంపెనీలకు చెందిన మానవ వనరుల అధికారులు జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. 560కు పైగా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బి.ఫార్మశి, ఎం.ఫార్మశి విద్యార్హత కలిగిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో జాబ్‌మేళాకు హాజరుకావాల్సిందిగా ఆమె సూచించారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించి సందేహాల నివృత్తికోసం 94916810 50, 8247645389, 9988553335, 8712655 686లో సంప్రదించాలని ఆమెసూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మామిడికుదురు, మే 22(ఆంధ్రజ్యోతి): 11 కేవీ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని పాశర్లపూడి, నగరం, మామిడికుదురు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కాట్రేనికోన:** కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 23న లైన్ల మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, గెద్దనపల్లి, దొంతికుర్రు గ్రామాలతోపాటు చెయ్యేరు ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు వైసీపీ నేతల పరామర్శ

అంబాజీపేట, మే 22(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంవద్ద బుధవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన చిరతపూడి వాసులు మామిడిశెట్టి కనకదుర్గ, ఆమె కుమారుడు వెంకటరత్నం కుటుంబ సభ్యులను వైసీపీ నేతలు గురువారం పరామర్శించారు. చిరతపూడిలో వారి మృతదేహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరలో కోలుకోవాలని కోరారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ నాయకులు విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ కోట బేబీరాణి తదితరులు పరామర్శించారు.

## ముంగండ ముత్యాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



ముత్యాలమ్మకి వెండి కిరీటాన్ని అందిస్తున్న సాదా కృష్ణ దంపతులు

పి.గన్నవరం, మే 22(ఆంధ్రజ్యోతి): ముంగండ చెరువుగట్టున ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మకు కేజీ వెండితో తయారుచేసిన రూ.1.82లక్షల విలువగల వెండి కిరీటాన్ని గ్రామానికి చెందిన సాదా కృష్ణ దంపతులు గురువారం అందించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని ధరింపచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మోటారు సైకిల్ స్వాధీనం

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గోపాయిలంకలోని వైనతేయనదీ తీరాన 8989 పల్సర్ మోటారుసైకిల్‌ను అల్లవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగురోజుల నుంచి పాశర్లపూడి పరిధిలోనిలంకపక్కన తుప్పల్లో ఉందని, దీన్ని స్వాధీనంచేసుకుని విచారిస్తున్నామని ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

## 'నాటక కళాపరిషత్‌ల నిర్వహణకు చేయూతనివ్వాలి'

ద్రాక్షారామ, మే 22(ఆంధ్రజ్యోతి): నాటక కళా పరిషత్‌ల నిర్వహణకు, కళాకారుల పింఛన్‌లకు ప్రభుత్వం ఆర్థికసహకారం అందచేయాలని సినీనటి, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ కార్యదర్శి ద్రాక్షారామ సరోజ, నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. రామవరంలో మూలారెడ్డి కళాపరిషత్ పోటీలు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌ను ద్రాక్షారామ నాటక కళాపరిత్ కార్యవర్గం కలసింది. నాటక కళాపరిషత్‌ల నిర్వహణకు ఎదురవుతున్న ఇబ్బందులు వారు తెలియచేశారు. మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించినట్లు ద్రాక్షారామ సరోజ, సతీష్‌రావు తెలిపారు.



మంత్రి దుర్గేష్‌తో నటి ద్రాక్షారామ సరోజ, నాగిరెడ్డి

## శాఖలవారీగా పుష్కర పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



నియోజకవర్గ అధికారుల రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మే 22(ఆంధ్రజ్యోతి): రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి శాఖలవారీగా పుష్కర పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంబంధిత అధికారులకు సూచించారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో పుష్కర పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ప్రసిద్ధిగాంచిన పుష్కరఘాట్‌లతోపాటు సమీప ఆలయాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఆదిశగా స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పనులను ప్రతిపాదించాలన్నారు. పాత పుష్కరఘాట్‌లను పరిశీలించి వాటి ప్రస్తుతస్థితిని, అక్కడ కావాల్సిన సౌకర్యాలను, ఆలయాల మరమ్మతులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యంగా పంచాయతీరాజ్, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ తదితర శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి పురాతన ఆలయాలు, పుష్కరఘాట్‌లు, ఘాట్‌లకు వెళ్లే రహదారులు, మౌళిక వసతులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. సంబంధిత ప్రతిపాదనలను ఐదురోజుల్లో అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి నదిపాయలకు సంబంధించి 29 పుష్కరఘాట్‌లు ఉన్నాయని వాటితోపాటు భక్తుల సౌకర్యార్థం మరిన్ని ఘాట్‌లు గుర్తించాలని ఆయన కోరారు. అనంతరం శాఖలువారీగా రివ్యూ నిర్వహించడంతో పలువురు సర్పంచ్‌లు, నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు గనిశెట్టి నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరావు, తహశీల్దార్‌లు పి.శ్రీపల్లవి, నాగలక్ష్మమ్మ, ఎంపీడీవోలు కేవీ ప్రసాద్, సరోవర్, గిడ్డి బీమారావు, వెంకటేశ్వరావు, హెడ్‌వర్క్స్ డీఈ సుబ్బారావు, పంచా యతీరాజ్ డీఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ జన్మదిన బ్రోచర్ విడుదల

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా ఒక బ్రోచర్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన ప్రతినిధుల సమక్షంలో గురువారం ఆవిష్కరించారు. స్థానికంగా ఉన్న హోటల్ శుభగృహలో ఈ బ్రోచర్ ఏర్పాటు కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘ రాష్ట్ర నేతలు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను ఆధ్వర్యంలో బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, డాక్టర్ ఈొప్పుల నాగమానస, ఆర్డీఎస్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర నాయకులు యాళ్ల దొరబాబు, నల్లా పవన్ కుమార్, మోకా సుబ్బారావులతో పాటు మున్సిపల్ జనసేన కౌన్సిలర్ పిండి అమరావతి, గండి హారిక, గొలకోటి విజయలక్ష్మి, బొర్రా వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.



అమలాపురంలో చిరంజీవి జన్మదిన వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు, తదితరులు

## పశువైద్యశాల ప్రతిపాదనలు మంత్రికి అందజేత

- భవన సముదాయాలకు రూ.1.48 కోట్ల నిధులు అవసరం

పి.గన్నవరం, మే 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ప్రాంతీయ పశువైద్యశాల శిథిలావస్థపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పందించిన విషయం పాఠకులకు విధితమే. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం ఆసుపత్రి ఏడీఏ విజయరెడ్డి, స్థానిక పశువైద్యులు డాక్టర్ కిరణ్ చైతన్యలు క్యాంపు కార్యాలయంలో కలిశారు. పి.గన్నవరం, అంబాజీపేటకు సంబంధించి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో గల ఆసుపత్రుల పరిస్థితిని వినతిపత్రం రూపంలో అందించారు. పి.గన్నవరంలో ప్రాంతీయ పశువైద్యశాల నూతనభవన సముదాయం, పర్నీచర్, నరేంద్రపురం గ్రామీణ పశువైద్యశాలకు నూతన భవనం, పరికరాలు, మానేపల్లి పశువైద్యశాలకు ప్రహరీగోడ, పర్నీచర్, అంబాజీపేట పశువైద్యశాలకు మరమ్మతులు, ప్రహరీగోడ, పర్నీచర్, ముక్కామల పశువైద్యశాలకు పర్నీచర్, పుల్లేటికుర్రు పశువైద్యశాలకు నూతన భవనం, పర్నీచర్ అవసరమని వినతిపత్రం రూపంలో అందించారు. నూతన భవనాలకు, పర్నీచర్, మరమ్మతులు తదితర అంశాలకు సంబంధించి రూ.1.48కోట్లు నిధులు అవసరం అవుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంబంధిత ప్రతిపాదనలను జిల్లా పర్యటనలో ఉన్న ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే అందించనున్నట్లు ఏడీఏ తెలిపారు.

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.06 లక్షలు

ఆత్రేయపురం, మే 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,06, 583 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

మండల ప్రజాపరిషత్ సమావేశం

కాట్రేనికోన, మే 22(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరి విడనాడాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ సమస్యలపై ఎన్నిసార్లు ఫోన్‌చేసినా అధికారులు స్పందించిన సందర్భాలు లేవని, లైన్‌మేన్‌లు అందుబాటులో ఉండటంలేదని, ప్రజాసమస్యలు పరిష్కరించలేని తాము పదవుల్లో ఉండటం ఎందుకని ఊప్పుడి సర్పంచ్ రంబాల రమేష్, ఎంపీటీసీ సంగాని మునీంద్రవర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉందని, ఇకపై అప్రమత్తంగా ఉంటామని ట్రాన్స్ కో ఏఈ శ్రీనివాస్ బదులిచ్చారు. వ్యవసాయ పనులకాలంలో ఉపాధి పనులతో రైతులు నష్టపోతున్నారని జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, ఎంపీటీసీ గెద్దాడ గుణవేణుకుమార్ ఉపాధి ఏపీవో దృష్టికి తెచ్చారు. ఉపాధి పనులు నాణ్యతగా చేయా లని, అధికారులు పర్యవేక్షణ చేయాలని వేణుకుమార్ అన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వివరణ ఇచ్చారు. బలుసుతిప్ప- కాకినాడ బస్సు సర్వీసును నడపాలని బలుసుతిప్ప ఎంపీటీసీ కోరారు. వేట్లపాలెంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయాలని వైస్ ఎంపీపీ-2 సానబోయిన నాగేశ్వరరావు కోరారు. ఎంపీడీవో ఎస్‌వీ చలం, తహసీల్దార్ సునీల్‌కుమార్, అధికారులు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై చేసిన అసత్య ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి

- జనసేన నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు

పి.గన్నవరం, మే 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను హిందూ వ్యతిరేకిగా ముద్రించి ఒక వీడియోను విడుదల చేసిన కృష్ణ ధర్మపరిరక్షణ సమితి రాష్ట్ర ముఖ్య అధ్యక్షుడు కేడీఆర్ (కె.దుర్గారావు) వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఈ విషయంపై జనసేన తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంక టేశ్వరావు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేతోపాటు జనసైనికులు కూడా హిందూ వ్యతిరేక కార్యకలాపాలు చేయలేదన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని పోయే ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణ లు చేశారన్నారు. అన్న క్యాంటీన్ అనేది ప్రభు త్వ నిర్ణయమని స్థలం సేకరించింది అధికా రులని విషయం తెలియని ఎమ్మెల్యేపై హిందూ వ్యతిరేకిగా ముద్రవేసే ప్రయత్నం చేశారని ఆయన మండిపడ్డారు. రామాలయం ఎదుట అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని విషయాన్ని మరోసారి పరిశీలించాలని ఆలయ నిర్వాహకులు కోరితే స్థానిక అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారన్నారు. రామాలయం విషయంతో జరుగుతున్న విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీడియోను విడుదల చేస్తే బాగుండేదని ఎవరో చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకుని వీడియో చేశారన్నారు. ప్రజల్లోకి వెళ్లిన ఆ వీడియోలో వ్యాఖ్యలను ఉపసంహ రించుకోవాలని వారు కోరారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి వాసంశెట్టికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధంలేని ఎవ్వరికి తెలియని వ్యక్తి కేడీఆర్..ఎమ్మెల్యే గెలుపులో ప్రధానపాత్ర పోషించాననడంవిడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల అధ్యక్షులు సాధనాల శ్రీవెంక టసత్య నారాయణ, గోపి, శ్రీనివాసరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో రెండు రైల్వే వంతెనలు

**ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు**

మండపేట, మే 22(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం, జడ్.మేడపాడుల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు లభించినట్టు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం తెలిపారు. ఎంతో కాలం నుంచి కేశవరం, జడ్.మేడపాడు రైల్వే గేట్‌ల వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2017లో ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా వంతెనల నిర్మాణానికి అనుమతులు సాధించామన్నారు. గత ప్రభుత్వం తన వాటా సొమ్ము చెల్లించలేమని చేతులెత్తేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎంపీ హరీష్‌మాధుర్‌ల సహాయంతో రెండు వంతెనలకు అనుమతి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణ చేసి కేంద్రానికి అప్పగిస్తే వంతెనల నిర్మాణం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

నవంబరులో శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అనంతరం ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తవుతాయని తెలిపారు. సమావేశంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, ఉంగరాల రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.06 లక్షలు

ఆత్రేయపురం, మే 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,06,583 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఆలమూరులోని బోణిచెరువు తవ్వకాల్లో ఉపాధి శ్రామికులు

# శరవేగంగా చెరువుల తవ్వకాలు

ఆలమూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువుల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా వందలాది మంది శ్రామికులు తవ్వకాల్లో పనిచేస్తున్నారు. ఆలమూరులోని బోణిచెరువు తవ్వకాలు పది రోజులుగా సాగుతున్నాయి. ప్రతిరోజు దాదాపు మూడు వందల మంది ఉపాధి శ్రామికులు పనిచేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పినపళ్లలో ఇదే పథకం ద్వారా తవ్వకాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల అడపాదడపా వర్షాలు కురవడంతో ఆయా పనులకు కొంతమేర అడ్డంకిగా మారుతోంది. వేసవి ముగియక ముందే వాటి పనులు పూర్తి చేయడానికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఎన్ఆర్‌జీఎస్ అధికారులు పేర్కొన్నారు.



న్యాయం కోరుతూ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన కోట గ్రామస్తులు

# కులం పేరుతో దూషించిన వ్యక్తిని శిక్షించాలి

కె.గంగవరం, మే 22(ఆంధ్రజ్యోతి): కోట గ్రామంలో గురువారం పరస్పరం ఆరోపణలపై ఇరుపక్షాలపై కేసులు నమోదు అయ్యాయి. పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఉపాధి హామీ పనులకు వెళ్లి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన కోటిపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు వారి మధ్యలో నుంచి బైక్‌పై వెళ్లడమే కాకుండా వారిని కులం పేరుతో దూషిస్తూ మాట్లాడాడని పలువురు మహిళలు వాదులాటకు దిగారు. వారికి ఆ వ్యక్తి సమాధానం చెబుతుండగా వారంతా అతడిని పట్టుకుని గ్రామస్తుల సహకారంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి అప్పగించారు. ఇది తెలుసుకున్న పలువురు గ్రామ దళితులు, పలువురు పెద్దలు స్టేషన్ వద్ద నినాదాలు చేశారు. కులం పేరుతో దూషించి అవమానపరచిన సుబ్రహ్మణ్యేశ్వరరావును ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమను బైక్‌తో గాయపరిచాడని బత్తుల మంగ, కోరుకొండ లక్ష్మీప్రసన్న, వాకపల్లి జయమ్మ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి వారిని వైద్యం కోసం రామచంద్రపురం ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ చెప్పారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసే వరకూ ఇక్కడే ఉంటామని మహిళలు పట్టుబట్టారు. దీంతో పెద్దలు మల్లిడి వెంకట్రావు, కాటే సుబ్రహ్మణ్యం తదితరులు పోలీసులతో చర్చలు జరిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పడంతో వారు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా పాతకక్షల నేపథ్యంలో తనపై అక్రమ కేసు బనాయిస్తున్నారని కోటిపల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ జానీ బాషా చెప్పారు.

## ఘనంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో బాబాకు కాగడ, తదితర హారతులు ఇచ్చారు. ఆలయాల్లో మహిళలు, భజన బృందాలు భక్తి గీతాలను ఆలపించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు బాబాను దర్శించుకుని పూజలు జరిపి నైవేద్యాలు సమర్పించారు.

బాబా భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు →



## 24న జాబ్‌మేళా

ముమ్మిడివరం, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డవలప్ మెంట్, ఉపాధి కల్పనా నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 24న ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి యి.వసంతలక్ష్మి గురువారం తెలిపారు. 11 ప్రముఖ కంపెనీలకు చెందిన మానవ వనరుల అధికారులు జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. 560కు పై గా ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బి.ఫార్మశి, ఎం.ఫార్మశి విద్యార్హత కలిగిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. తమ సర్టిఫికెట్స్, బయోడేటా జిరాక్సు కాపీలతో హాజరుకావాల్సిందిగా ఆమె సూచించారు. వివరాలకు 9491681050, 8247645389, 99885 53335, 8712655 686లో సంప్రదించాలన్నారు.

## నేడు రైతులకు పశువుల దాణా పంపిణీ

మండపేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామంలో నేటి ఉదయం పశువుల ఆసుపత్రి వద్ద రైతులకు రాయితీపై పశువుల దాణా పంపిణీ చేస్తారని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వత వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

# శ్రీరామదూతం శిరసా నమామి

**• ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు • ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

ఆలమూరు, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు అంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో తమలపాకులతోపాటు పండ్ల రసాలతో స్వామివారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని గుమ్మిలేరు, మోదుకూరు, సందిపూడి, పినపళ్ల, పెదపళ్ల, చింతలూరు, కొత్తూరు, కలవచర్ల, పెనికేరు, నర్సిపూడి, చొప్పెల్ల, జొన్నాడ, మూలస్థానం, చెముడులంక, మడికి గ్రామాల్లో హనుమాన్ జయంతిని జరుపుకున్నారు.



మండపేటలోని కరాచీ సెంటర్‌లో ఆంజనేయస్వామి

**మండపేట, (ఆంధ్రజ్యోతి):** మండపేటతో పాటు మండలంలోని ఆయా ప్రాంతాల్లో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన కరాచి సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష తమలపాకుల పూజ, గంధ సిందూరం పూజ, హనుమత్ వ్రతాలు నిర్వహించారు. మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు బూరుగుంట రామాలయం వద్ద అంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రథం గుడి, కేపీ రోడ్డు, దర్శగుండం చెరువు వద్ద ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి. మండలంలో అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు, ద్వారపూడి, కేశవరం, ఏడిద, మెర్నిపాడు, వై.సీతానగరం, పాలతోడు, వెలగతోడు తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా జరిపారు.



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా ప్రాంతాల్లో హనుమత్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ర్యాలి హనుమాన్ ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు. పలువురు భక్తులు హనుమత్ దీక్షాధారణ చేపట్టారు. పంచామృతాభిషేకం, గంధం సిందూరం, తమలపాకులతో అభిషేకం చేశారు. భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న హనుమాన్‌కు ప్రత్యేక అభిషేకాలు, సహస్రనామార్చన, రక్షాకంకణాలతో అలంకరణ చేశారు. ఆయా ఆలయాల వద్ద హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



రావులపాలెంలో పూర్ణాలంకరణలో చిన్న ఆంజనేయస్వామి

**ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి):** రామచంద్రపురం మండలంలో హనుమజ్జయంతిని గురువారం ఘనంగా జరిపారు. ద్రాక్షారామ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

**కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయం తిని నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామి వారిని పూలు, తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పామర్రులో మహిళలు పదకొండుసార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కోటిపల్లి, పామర్రు, గంగవరం, సత్యవాడ, తామరపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**కొత్తపేట, (ఆంధ్రజ్యోతి):** కొత్తపేట కొత్త రామాలయం ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బోడిపాలెం భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమన్ జయంతిని పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు పూజలు జరిపారు. స్వామివారికి తమలపాకులు గంధసిందూరం సమర్పించి మొక్కులు చెల్లించారు. మండలంలోని ఆయా ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు.

**రాయవరం, (ఆంధ్రజ్యోతి):** రాయవరం మండలంలో ఆయా ప్రాంతాల్లో హనుమత్ జయంతిని గురువారం నిర్వహించారు. రాయవరం పాత బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పురోహితుడు కె.సూర్యనారాయణ మూర్తి, వెదురుపాక తుల్యభాగ కాలువ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో సూర్యనారాయణశర్మ, వి.సావరం ఆంజనేయస్వామి ఆలయంలో గొడితి త్రినాధశర్మ ఆధ్వర్యంలో సిందూరపూజ, లక్ష తమలపాకుల పూజ, హోమం, పూర్ణాహుతి జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**రావులపాలెం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆయా ప్రాంతాల్లో హనుమత్ జయంతిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రావులపాలెం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. ప్రధానంగా స్థానిక పెద, చిన ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి తమలపాకుల పూజ, గంధసిందూర పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఆలమూరులో ఆంజనేయస్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం



కె.గంగవరం మండలం పామర్రులో ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారు

**కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు, తమలపాకులు, గంగ సిందూరంతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన కూడలిలో స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపారు. భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బండారు, పార్టీ శ్రేణులు

## మంత్రి అచ్చెన్నాయుడుకు స్వాగతం

రావులపాలెం, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు రావులపాలెంలో ఆ పార్టీశ్రేణులు స్వాగతం పలికారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆయన్ను సత్కరించి స్వాగతం పలికారు. ఆయనతో పాటు యువ నాయకుడు బండారు సంజీవ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేగుళ్ల లీలాకృష్ణ

## ఉపముఖ్యమంత్రిని కలిసిన లీలాకృష్ణ

మండపేట, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను మంగళగిరిలో కలిశారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా తనను నియమించినందుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

## రేషన్‌షాపుల వద్ద ప్రధాని ఫొటో ఏర్పాటు చేయాలి

కొత్తపేట, మే 22(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి రేషన్‌షాపు వద్దే బియ్యం సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రతి రేషన్ షాపు వద్ద ఖచ్చితంగా ప్రధాని మోడీ ఫోటో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ముత్యాలమ్మకు వెండి కిరీటం బహూకరణ

పి.గన్నవరం, మే 22(ఆంధ్రజ్యోతి): ముంగండ చెరువుగట్టున ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మకు కేజీ వెండితో తయారు చేసిన రూ.1.82లక్షల విలువగల వెండి కిరీటాన్ని గ్రామానికి చెందిన సాధా కృష్ణ దంపతులు గురువారం అందించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిరీటాన్ని ధరింపచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లక్షలుపోసి కట్టారు...వదిలేశారు

**• నిరుపయోగంగా మంచినీటి ట్యాంకులు • పట్టించుకోని అధికారులు**

ఆలమూరు, మే 22(ఆంధ్రజ్యోతి): రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లకు కొద్దిపాటి నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తే ఉపయోగంలోకి వస్తాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటిని అలానే వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. ఆలమూరులో రెండు వాటర్ ట్యాంక్‌లు నిర్మించారు. ఆలమూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎర్రకాలనీలో రూ.47.35 లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ను నిర్మించారు. వీటికి కొంతమేర పైపులైన్ ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ మోటార్ వేయకపోవడంతో ఉపయోగంలోకి రాకుండా పోయాయి. కాపు కల్యాణ మండపం వద్ద నిర్మించిన ట్యాంక్‌కు పైపులైన్ నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా చెల్లింపులు కాకపోవడంతో మోటార్‌ను వేయకుండా వదిలేశారు. దీంతో ఈ రెండు ట్యాంక్‌లు నిరుపయోగంగా మారాయి. అధికారులు, పాలకులు గుర్తించి నిరుపయోగంగా ఉన్న ట్యాంక్‌లను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



ఆలమూరులో నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకులు

## నాటక కళాపరిషత్‌ల నిర్వహణకు చేయూతనివ్వాలి

ద్రాక్షారామ, మే 22(ఆంధ్రజ్యోతి): నాటక కళా పరిషత్‌ల నిర్వహణకు, కళాకారుల పింఛన్‌లకు ప్రభుత్వం ఆర్థికసహకారం అందచేయాలని సినీనటి, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ కార్యదర్శి ద్రాక్షారామ సరోజ, నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. రామవరంలో మూలారెడ్డి కళాపరిషత్ పోటీలు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌ను ద్రాక్షారామ నాటక కళాపరిత్ కార్యవర్గం కలసింది. నాటక కళాపరిషత్‌ల నిర్వహణకు ఎదురవుతున్న ఇబ్బందులు వారు తెలియచేశారు. మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించినట్లు ద్రాక్షారామ సరోజ, సతీష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో నాటక కళాపరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌తో నటి ద్రాక్షారామ సరోజ, నాగిరెడ్డి తదితరులు



అంగర పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కపిలేశ్వరపురం, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. గురువారం అంగర పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లేబొరేటరీ, ఫార్మశీ, ప్రసూతి విభాగాలు, పేషెంట్లకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నారావు, రామచంద్రపురం డివిజనల్ అధికారి డాక్టర్ ఎన్.ప్రశాంతి, డివిజనల్ సూపర్‌వైజర్ కమలశేషు, ఎంపీహెచ్ ఈవో జె.మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు తదితరులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## మోటారు సైకిల్ స్వాధీనం

అమలాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గోపాయిలంకలోని వైనతేయనదీ తీరాన 8989 పల్సర్ మోటారుసైకిల్‌ను అల్లవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగురోజుల నుంచి పాశర్లపూడి పరిధిలోనిలంకపక్కన తుప్పల్లో ఉందని, దీన్ని స్వాధీనంచేసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.



సాయిబాబా ఆలయంలో హుండీని బద్దలుకొట్టిన దృశ్యం

## షిర్డీసాయి ఆలయంలో చోరీ

రాయవరం, మే 22(ఆంధ్రజ్యోతి): రాయవరం బస్టాండ్ వెనుక ఉన్న షిర్డీసాయి ఆలయంలో బుధవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ బద్దలు కొట్టి చోరీ చేశారు. అదే విధంగా స్థానిక రాజేశ్వరి కాలనీలో ఉన్న వినాయకుని ఆలయం వద్ద గుడి తలుపులు పగలుకొట్టి చోరీకి యత్నించారు. చోరీ ఘటనలపై బాబా ఆలయ కమిటీ సభ్యులు రాయుడు సుబ్రహ్మణ్యం, గుడాల సూరిబాబు రాయవరం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

## టీడీపీ మండల అధ్యక్షుడిగా రవికుమార్

కె.గంగవరం, మే 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు మేడిశెట్టి రవికుమార్ పేరును ఖరారు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అతని పేరును ఖరారు చేయగా, పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈయన మాజీ ఎమ్మెల్యే మేడిశెట్టి వీరవెంకటరామారావు కుమారుడు. గతంలో కె.గంగవరం మండలం జడ్పీటీసీ సభ్యుడిగా ఆయన పనిచేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో జంగిల్ క్లియరెన్స్, చెట్లకొమ్మల తొలగింపు నిమిత్తం మండలంలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ కె.రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.



బీసీ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

## బీసీ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

ద్రాక్షారామ,మే22(ఆంధ్రజ్యోతి): వేగాయమ్మపేటలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న బీసీ సామాజిక భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.సూర్యప్రకాష్, ఎంపీపీ ఎ.భవానీ తదితరులు పాల్గొన్నారు.